క్లుప్తంగా

నేడు కోటిలో గ్రామసభ

మధురపూడి: కోరుకొండ మండలం కోటిలో శనివారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పాపారావు తెలిపారు. భూముల రీసర్వే కార్యక్రమంలో భాగంగా సభలు నిర్వహిస్తున్నామన్నారు. సభ అనంతరం మరుసటి రోజున రీసర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రైతు సోదరులు సహకరించాలన్నారు.

రేపు యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ద్వారకామయి కల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం జరుగుతుందని ఆ సంఘం కోరుకొండ మండలాధ్యక్షుడు జీవీ శివబాబు తెలిపారు. సమావేశానికి టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న షరీఫ్

సీతానగరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీయూటీఎఫ్) సీతానగరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జీవీఎల్ సత్యనారాయణ, ఆర్.పాపారావు ఎన్నికయ్యారు. కాటవరంలోని సంజీవపురం పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యవర్గ ఎన్నికకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా మన్యం పోశయ్య, సహాధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు, సహాధ్యక్షురాలిగా ఎస్.విజయలక్ష్మి, కోశాధికారిగా పి.సూరిబాబు, ఆడిటర్‌గా ఎస్.రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోరుకొండలో ఆదివారం జరిగే జిల్లా కౌన్సిల్ సమావేశాలకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈ.శ్రావణి, ఆర్పీ దేవవాణి పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండలరావు



సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీతానగరానికి చెందిన మద్దాల కొండలరావు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే , పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకూ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులను ఇప్పటికే నియమించామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలన్నారు.

అనపర్తి బీజేపీ కోకన్వీనర్‌గా మురముళ్ల



పెదపూడి: అనపర్తి నియోజకవర్గం బీజేపీ కో కన్వీనర్‌గా జి.మామిడాడ గ్రామానికి చెందిన మురముళ్ల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందాయని వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను పార్టీలో జిల్లా నమామి గంగా ప్రముఖ్‌గా వ్యవహరిస్తున్నానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు జిల్లా ఉపాధ్యక్షుడు మేడపాటి హరినారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోటకూర వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

రికార్డుల పరిశీలన

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నల్గొండలోని 241/3 సర్వే నంబర్‌పై రికార్డులను భూగర్భ వనరుల శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ విఘ్నేష్, సర్వేయర్ అజిత శుక్రవారం పరిశీలించారు. నల్గొండలోని 241/3 సర్వే నంబర్‌లోని కొండను కొందరు అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని కలెక్టర్, స్థానిక తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లలో గతంలో చినకొండేపూడికి చెందిన న్యాయవాది చిడిపి నకుల సురేష్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయానికి మైన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు చేరుకుని రికార్డులను పరిశీలించారు. త్వరలో నల్గొండ రెవెన్యూలోని సర్వే నంబర్ కొండను పరిశీలించి, నివేదికను పైఅధికారులకు అందజేస్తామని భూగర్భ జలవనరులశాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ విఘ్నేష్ తెలిపారు.

టీడీపీ, జనసేన సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ద్వారకామయి కల్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రెండు పార్టీల కలయికతో విజయాన్ని సాధిద్దామన్నారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, కంటే నాగేశరావు, వలవల రాజా, గంగిసెట్టి చంటిబాబు పాల్గొన్నారు.

విజ్ఞాన గనులు

- గ్రంథాలయాలతో ప్రయోజనాలెన్నో..
- పుస్తక పఠనంపై పెరుగుతున్న ఆసక్తి
- విద్యార్థులకు వివిధ రకాల పోటీలు
- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

బిక్కవోలు: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు గ్రంథాలయ సంస్థ చర్యలు తీసుకుంటోంది. మంచి ర్యాంకులు సాధించే లక్ష్యంతో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమవుతున్నారు. పాఠ్యాంశాలను బట్టీపట్టి పరీక్షలు రాస్తున్నారు. దీంతో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదివే తీరిక వారికి ఉండడం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు గ్రంథాలయాలను పరిచయం చేసి, అందులో ఉండే విలువైన పుస్తకాలను చదివించే దిశగా గ్రంథాలయ సంస్థ కృషి చేస్తోంది. అధికారులు పాఠశాలలకు సైతం వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పుస్తక హుండీలను ఏర్పాటు చేసి పుస్తకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజూ వివిధ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలతో పాటు గ్రంథాలయాల ప్రాముఖ్యం తెలిసేలా ప్రముఖులతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిని వేదికగా చేసుకుని పాఠకుల సంఖ్య, సభ్యత్వాలను పెంచుకునేందుకు గ్రంథాలయ సంస్థ సిబ్బంది కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, కొంకుదురు, కొమరిపాలెం, పెదపూడి, రంగంపేట గ్రామాల్లో శాఖా గ్రంథాయాలు ఉన్నాయి.

విద్యార్థుల ఆసక్తి

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ పోటీల ద్వారా విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శిస్తున్నారు. పుస్తక ప్రదర్శనల ద్వారా అందులో ఉండే విలువైన గ్రంథాలను తెలుసుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో వాటిని చదవడం ద్వారా ఎంతో విలువైన సమాచారం తెలుసుకోవచ్చని, ప్రముఖుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం ద్వారా వారి స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగవచ్చని విద్యార్థులకు ఉద్బోధిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు ఆయా పుస్తకాలు చదవడంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. గ్రంథాలయాల్లో ఉండే చిన్ని కథలు, హాస్యం, సైన్సుకు సంబంధించిన పుస్తకాలను పుస్తక ప్రదర్శనలో ఉంచుతున్నారు.



కొంకుదురులో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న హైస్కూల్ విద్యార్థులు

పుస్తక హుండీల ఏర్పాటు

గ్రంథాలయాలకు పుస్తకాలను దానం చేసే వారి కోసం ప్రత్యేకంగా పుస్తక హుండీలను అందుబాటులో ఉంచారు. పురాతన గ్రంథాలు, మంచి సమాచారం అందించే పుస్తకాలను దాతలు తీసుకువచ్చి గ్రంథాలయంలో అందించవచ్చు. దాతలు ఇచ్చే అరుదైన, పురాతన గ్రంథాలను పునర్ ముద్రించి భవిష్యత్తు తరాలకు అందించేందుకు గ్రంథాలయ సంస్థ చర్యలు తీసుకుంటుందని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. దాతలు ఇచ్చిన వాటిలో పాడైన పుస్తకాలను బైండింగ్ చేసి, పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇంట్లో చదివి మూలన పడేసిన మంచి పస్తకాలను ఉపయోగించుకునేలా దాతలు గ్రంథాలయంలోని హుండీలో వేసేలా ప్రచారం చేస్తున్నారు.



విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు

గ్రంథాలయానికి వెళ్లడం వల్ల విజ్ఞాన విషయాలు చాలా తెలిశాయి. ఇంకా ప్రతిరోజూ గంట సమయం గ్రంథాలయంలో ఉండడంతో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

– కోన దినేష్‌కుమార్, విద్యార్థి, కొంకుదురు



పెరిగిన విద్యార్థులు సంఖ్య

గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు సంఖ్య గతంలో కంటే పెరిగింది. మరింత మంది పాఠకులను పెంచేందుకు ఈ వారోత్సవాలు దోహదపడుతున్నాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడంతో పాటు పుస్తక హుండీల ప్రాధాన్యాన్ని దాతలకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు, పాఠకులకు ఉపయోగపడే పుస్తకాలు ఇస్తే, వారికి అందుబాటులో ఉంచుతాం.

– నందికోళ్ల బాల, లైబ్రేరియన్, కొంకుదురు

26న గవర సంఘీయుల ఆత్మీయ కలయిక



సమావేశంలో మాట్లాడుతున్న మద్దాల రమణ

మధురపూడి: పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో ఈ నెల 26 వ తేదీన నిర్వహించనున్న గవర సంఘీయుల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దాల రమణ విజ్ఞప్తి చేశారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సెంటర్‌లోని గౌరీదేవి ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం గవర సామాజిక వర్గం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కాగా.. ఆత్మీయ కలయికకు సంఘీయులందరినీ నిర్వాహకులు ఆహ్వానించారు. సమావేశంలో సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, ఎంపీటీసీ తనకాల నూకరాజు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సూరిశెట్టి అప్పలస్వామి, దాడి శివాజీ, కొయిడాల నానాజీ పాల్గొన్నారు.

మెట్ట ప్రాంత రైతులకు వైఎస్సార్ జలకళ వరం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ జలకళ పథకం మెట్ట ప్రాంత రైతులందరికీ వరమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మండలంలోని 18 మంది రైతులకు ఉచిత మోటార్లు, పంపు సెట్లు, ట్యూబులు, ఎలక్ట్రికల్ వైర్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకంలో మండలంలో 475 మంది రైతులకు బోర్‌వెల్స్ మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 275 మంది రైతులకు డ్రిల్లింగ్ పూర్తయిందని, 158 మంది రైతులకు మోటార్లు మంజూరయ్యాయని వివరించారు. రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ శాఖల అభివృద్ధిని సమావేశంలో వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యలను పలువురు ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా, వాటన్నింటినీ పరిష్కరించాలని ఎమ్మెల్యే స్థానిక విద్యుత్ ఏఈ సీహెచ్ నాగేశ్వరరావును ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, తహసీల్దార్ ఎం.దొరకయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రైతులకు జలకళ పథకంలో ఉచిత మోటార్లు అందిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

మూడు పథకాల ద్వారా సాగునీరు

పూర్తి మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని అన్ని గ్రామాలకు మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి నీరందించే అదృష్టం తనకు దక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాగునీటి సంఘం కన్వీనర్ పుట్టా సోమన్నచౌదరి ముద్రించిన రంగంపేట మండలానికి గోదావరి జలాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చాగల్నాడు, వెంకటనగరం, పుష్కర ఎత్తిపోతల పథకాలను అనుసంధానం చేయడం ద్వారా ఆరు గ్రామాలకు, వెంకట్‌నగరం ద్వారా ఆరు, పుష్కర ద్వారా నాలుగు గ్రామాలకు సాగునీరు అందిస్తున్నామని వివరించారు. తీవ్ర వర్షాభావం వల్ల ఈ ఏడాది చాగల్నాడు ఎత్తిపోతల పథకం కింద కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు కొరవడినా, ఎమ్మెల్యే సొంత నిధులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి 60 కి.మీ. పొడవునా చాగల్నాడు, వెంకటనగరం, పుష్కర కాలువలను అభివృద్ధి చేశారన్నారు. మండలంలో కాలువల పనులను పర్యవేక్షించిన సాగునీటి సంఘం కన్వీనర్ పుట్టా సోమన్నచౌదరి మాట్లాడుతూ చాలా కాలంగా పూడుకుపోయిన మండల కాలువల వ్యవస్థకు పూర్తిస్థాయి మోక్షం కలిగిందన్నారు. అనంతరం కాలువల పునరుద్ధరణ పనుల్లో చురుగ్గా పాల్గొన్న అడబాల వెంకటేశ్వరరావు, అద్దాల వెంకటేష్, పుట్టా సోమన్నచౌదరిని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుమారప్రియంలో గడప గడపకూ..

పెదపూడి: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి, వారి జీవితాల్లో వెలుగు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కుమారప్రియం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, జగన్ రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని ప్రజలు ఆనందంతో కొనియాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పెమ్మనబోయిన సత్తిబాబు, మాజీ సర్పంచ్‌లు తోటకూర విశ్వేశ్వరరావు, పెమ్మనబోయిన సాయిరామ్, పార్టీ నాయకులు మంగం సత్యనారాయణ, లంక జానకిరామయ్య, పెంటపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కుమారప్రియంలో మహిళకు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి

పెదపూడి: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో నిత్యం పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయం కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. వాటర్ ట్యాంక్‌లు 15 రోజులకోసారి బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలన్నారు. ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలన్నారు. తడి, పొడి చెత్తలను ఎప్పటికప్పుడు సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు విక్రయాలు, తయారీ పెంచాలని పేర్కొన్నారు. రహదారి మలుపుల్లోని పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించాలన్నారు. పన్నుల వసూళ్లు వేగంగా చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, జి.త్రినాథ్, అచ్చిరాజు, బి.ప్రసన్నకుమార్, ఎస్వీ స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పొలంబడితో రైతులకు సమగ్ర అవగాహన

పెదపూడి: పొలంబడి కార్యక్రమంలో రైతులకు సాగుపై సమగ్రమైన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించామని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. దోమాడ గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 14 వారాల పాటు పొలంబడి నిర్వహించామన్నారు. సాగులో మిత్ర పురుగుల ఉపయోగం, శత్రు పురుగుల నష్టం, సకాలంలో చేపట్టే చర్యలు తదితర వాటిపై అవగాహన కల్పించామన్నారు. డిసెంబర్ 15 నాటికి రబీ వరినాట్లు పూర్తిచేయాలన్నారు. అవసరమైన సూచనలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి స్వామి, సర్పంచ్ మీనవల్లి శారదదేవి పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మ వారి ఆలయంలో నూతన ఆలయ ప్రవేశం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల పూజా కార్యక్రమాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దాతలు సమకూర్చిన నిధులతో ఆలయ పునఃనిర్మాణాన్ని చేపట్టారు. ఆలయ ప్రవేశం, విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వేదమూర్తులు బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో వేదస్మార్త పండితులు చెల్లపిళ్ల త్రిమూర్తిశర్మ బ్రహ్మత్వంలో రుత్విక్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ, ద్రాక్షారామ శ్రీవేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం, కర్రి ధర్మారెడ్డి, మంగయ్యమ్మ దంపతులతో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు జరిపించారు. ఉదయం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశీన, వాస్తు, యోగిని క్షేత్రపాలక, నవగ్రహ షోడశరామలింగ, సర్వలోభద్రపండప ఆవాహన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మత్సంగ్రహణం, అంకురారోహణ, అగ్నిప్రతిష్ఠాపన, మూర్తి హోమాది క్రతువులు జరిపారు. ఈ నెల 19న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుంది. ఆయా కార్యక్రమాల్లో అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ల అమ్మిరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధి సత్తి వెంకటరామారెడ్డి, కర్నాటక త్రినాథరెడ్డి, పడాల కల్యాణ్‌రెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి బుల్లిరెడ్డి, పడాల సత్తిరెడ్డి, మల్లిడి శంకర్‌రెడ్డి, మల్లిడి ప్రతాపరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు, ఇతర ప్రముఖులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బిక్కవోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొంకుదురు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం స్థానిక కొవ్వూరి సత్తిరెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని లైబ్రేరియన్ ఎన్.బాల తెలిపారు. ఉపాధ్యాయులు కె.సుధాకర్‌రెడ్డి, పి.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

రాజానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉదయం చిత్రలేఖనం, సాయంత్రం దేశ భక్తి పాటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ 2 జ్యోతిప్రసాద్ పర్యవేక్షణలో ఇవి జరిగాయి.



దేశభక్తి గీతాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మధురపూడి: యువత సెల్‌ఫోన్లు, మాధ్యమాలకు బానిసలు కాకుండా, పుస్తక పఠనం చేయాలని ఎంఈఓ టి.కుశలవ దొర అన్నారు. కోరుకొండ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై వక్తృత్వ పోటీ, దేశ భక్తిగీతాల పాటల పోటీ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

రంగంపేట: సామాజిక వికాసానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని సాహిత్య గాయకుడు దువ్వాడ నూకరాజు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయోద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి నూకరాజు ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్‌ల నుంచి పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం 65 మంది స్కూళ్ల విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. సాహిత్య కళాకారుడు అంబడిపూడి కృష్ణశర్మ, ఎం.మౌనిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

రామేశ్వరం ఉప సర్పంచ్‌గా దూళ్ల వీరబాబు!

పెదపూడి: రామేశ్వరం గ్రామ ఉప సర్పంచ్‌గా దూళ్ల వీరబాబును పంచాయతీ పాలకవర్గం గురువారం రాత్రి నియమించింది. సర్పంచ్ కొటికలపూడి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంతవరకు ఉప సర్పంచ్‌గా వ్యవహరించిన కొటికలపూడి వరలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఉప సర్పంచ్ ఎన్నికకు ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఈ తరుణంలో పాలకవర్గం ఉప సర్పంచ్‌గా దూళ్ల వీరబాబును ఎంపిక చేయాలని నిర్ణయించుకుంది. ఈ సందర్భంగా వీరబాబుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గజమాల వేసి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, కొటికలపూడి గణేష్, ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వీరబాబును గజమాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ఘనంగా నాగులచవితి



పశ్చిమగానుగూడెంలో భక్తుల పూజలు

రాజానగరం/మధురపూడి/సీతానగరం/గోకవరం/అనపర్తి: నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు. గుడ్లు, పాలు, నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాన్ని చల్లగా చూడాలని స్వామిని ప్రార్థించారు. పూజల అనంతరం చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు.



పుట్టకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు



అనపర్తిలో..



దివాన్ చెరువులో..



సీతానగరంలో..



గోకవరం వీరభద్రునిగడ్డలో..

ఘనంగా లక్ష బిల్వార్చన

పెదపూడి: సంపర గ్రామంలో శుక్రవారం అయ్యప్ప స్వాముల లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యుల ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది అయ్యప్ప మాలధారణ చేశారు. స్వాములు పడి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా స్వామి వారికి విశేష పూజలు చేసి, భక్తిగీతాలు ఆలపించారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో గ్రామం మారుమోగింది.



సంపరలో పడిపూజ చేస్తున్న హనుమంతాచార్యులు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. కాగా శుక్రవారం బాధితులు బాతు కుమారి, డొంకా రఘుపతిమ్మలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, స్థానిక నాయకులు పరామర్శించి రూ.5 వేలు నగదు, బియ్యం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి రాంప్రసాద్, బద్దిరెడ్డి మెహర్‌బాబా, మచ్చా మోహన్ పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు